క్లుప్తంగా

ముగిసిన సీబీసీ యోగా చిత్ర ప్రదర్శన



ఏయూ యోగా విలేజ్‌లో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

మహారాణిపేట: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్(సీబీసీ) బీచ్‌రోడ్డులోని ఏయూ యోగా విలేజ్‌లో నిర్వహిస్తున్న చిత్ర ప్రదర్శన మంగళవారం ముగిసింది. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న ఈ చిత్ర ప్రదర్శనను ప్రారంభించారు. యోగాసనాలు, యోగా ప్రక్రియలు, వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ చిత్ర ప్రదర్శనను తిలకించడానికి బీచ్‌కు వచ్చిన సందర్శకులు ఆసక్తి చూపారు. వివిధ కళాశాలలు, పాఠశాలల్లో యోగాపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

యూసీడీ లైన్లకు మరమ్మతులు



యూసీడీ పనులను పరిశీలిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని పలు ప్రాంతాల్లో యూసీడీ లైన్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ లైన్లు సరిగ్గా లేకపోవడంతో తాగు నీరు కలుషితమవుతున్నట్టు ప్రజలు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె వెంటనే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి యూసీడీ లైన్లకు మరమ్మతులు చేయించారు. ఈ పనులను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పర్యవేక్షణలో పూర్తి చేశారు.

గిరి మహిళకు అండగా..

సత్వరం వైద్యం చేయాలని ఆదేశించిన ఎంపీ డాక్టర్ తనూజారాణి



గిరిజన మహిళ మర్రి గాసమ్మ

మహారాణిపేట: విశాఖ కేజీహెచ్‌లో 13 రోజులుగా వైద్యం అందక అవస్థ పడుతున్న గిరిజన మహిళకు అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజారాణి అండగా నిలిచారు. అరకులోని పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీలోని పెదగొంది గ్రామానికి చెందిన మర్రి గాసమ్మ (34) ఈనెల 12న చికిత్స కోసం విశాఖ కేజీహెచ్‌లో చేరింది. నేటికి 13 రోజులు కావస్తున్నా ఇప్పటికీ ఆమెకు ఎలాంటి వైద్యం అందలేదు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ తనూజారాణి స్పందించారు. ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో ఉన్న ఆమె కేజీహెచ్ వర్గాలతో చరవాణి ద్వారా మాట్లాడారు. రోగి సమస్యను వారికి వివరించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీ ఆదేశించడంతో తక్షణం వైద్యులు స్పందించారు. గురువారం శస్త్ర చికిత్స చేయడానికి కేజీహెచ్ వైద్యులు అంగీకరించడంతో వారిని ఎంపీ తనూజారాణి అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ వెల్‌నెస్ సెంటర్‌కు ఈవోఐ విడుదల

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఉక్కు స్టేడియం ఆవరణలో ఉన్న వెల్‌నెస్ సెంటర్‌కు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటన విడుదల చేసింది. సుమారు 5 వేల చదరపు అడుగులు కలిగిన ఆర్‌సీసీ బిల్డింగ్ ప్రాంగణాన్ని 10 ఏళ్ల పాటు అద్దెకు ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను జూలై 6 వరకు స్టీల్‌ప్లాంట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు. దరఖాస్తుకు జూలై 13ను ఆఖరి తేదీగా నిర్ణయించారు. ఆసక్తి గల వ్యక్తులు, పార్టీలు గడువు వ్యవధిలోగా తమ దరఖాస్తులు అందజేయాలని తెలియజేశారు.

పర్యాటకం.. ప్రగతి పథం



కైలాసగిరిపై శివపార్వతుల విగ్రహాలు



ఆర్‌కే బీచ్‌లో కురుసుర

- 'తూర్పు'లో ఆకట్టుకుంటున్న పర్యాటక ప్రాంతాలు



సీతకొండ సీ వ్యూ



తెన్నేటి పార్కు

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గం పర్యాటక ప్రాంతాలకు నిలయంగా మారింది. కైలాసగిరి, వీఎంఆర్‌డీఏ పార్కు, ఆర్‌కే బీచ్‌తో పాటు శివాజీ పార్కు, ముడసర్లోవ పార్కు, తెన్నేటి పార్కు, సీతకొండ సీ వ్యూ పాయింట్ నిత్యం సందర్శకులతో కళకళలాడుతున్నాయి. దీంతో నియోజకవర్గంలో పలు రకాల వ్యాపారాలు జోరుగా కొనసాగుతున్నాయి. వీటిలో ఫుడ్ కోర్టులు, కాఫీ షాపులకు డిమాండ్ నెలకొంది. బీచ్ రోడ్డు, ఎంవీపీ కాలనీ ప్రాంతాలలో హోటళ్ల వ్యాపారం ఊపందుకుంది. చిల్లర వ్యాపారులు వందలాది మంది పర్యాటక ప్రాంతాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

కైలాసగిరి

వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తున్న కైలాసగిరి నగరంలో ఉన్న పర్యాటక ప్రాంతాల్లో ఆణిముత్యంగా పేరు పొందింది. నగరానికి వచ్చిన ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, విదేశీయులు కైలాసగిరిని సందర్శించకుండా వెళ్లరంటే అతిశయోక్తి కాదు. ఇక్కడి అందాలు మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. ఓ వైపు సముద్రం, మరో వైపు పెద్ద భవంతులతో కూడిన నగరం, ఇంకో పక్క పచ్చని కొండలు కనువిందు చేస్తున్నాయి. జాతీయ రహదారిని ఆనుకొని హనుమంతవాక వద్ద, బీచ్ రోడ్డును ఆనుకొని అప్పుఘర్ వద్ద మెట్ల మార్గాలు ఉన్నాయి. విశాలాక్షినగర్ మీదుగా రోడ్డు మార్గం ఉంది. అప్పుఘర్ వద్ద రోప్‌వే కూడా అందుబాటులో ఉంది. కొండపై ఉన్న సర్క్యూట్ ట్రైన్‌లో ప్రయాణిస్తూ నగరం అందాలన్నీ తిలకించచ్చు. ప్రవేశం రుసుం రూ.10. ద్విచక్ర వాహనానికి రూ.20, కారుకు రూ.50, జీపు, ఓమ్ని వాహనాలకు రూ.70, మినీ బస్‌కు రూ.150, బస్సుకు రూ.300 టికెట్ చెల్లించాలి.

వీఎంఆర్‌డీఏ పార్కు

బీచ్ రోడ్డులో మరో పర్యాటకం ప్రాంతం వీఎంఆర్‌డీఏ(వుడా) పార్కు. ఇది సముద్రం అలలను తాకుతూ ఉండే పార్కు. దీని లోపల స్కేటింగ్ శిక్షణ, బోటింగ్ సదుపాయాలు ఉన్నాయి. పిల్లలకు ఆడుకోవడానికి పలు రకాల ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశారు. ఇవన్నీ పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. దీన్ని కూడా వీఎంఆర్‌డీఏ నిర్వహిస్తోంది.

ఆర్‌కే బీచ్

విశాఖలో బీచ్ పేరు చెప్పగానే ఆర్‌కే బీచ్ గుర్తుకు వస్తుంది. సుమారు రెండు కిలోమీటర్లకు పైగా పొడవుండే ఈ బీచ్‌లో చల్లదనం కోసం నగరానికి వచ్చినవారు ఇక్కడ సేదదీరుతారు. ఇక్కడ ఉన్న సౌకర్యాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడ కురుసుర యుద్ధ నౌక, టీయూ–142 యుద్ధ విమానం విశేష ఆదరణ పొందాయి. వీటిని జీవీఎంసీ నిర్వహిస్తోంది. కురుసుర ప్రవేశం రుసుం రూ.70, టీయూ–142 ప్రవేశం రుసుం రూ.100.

- నియోజకవర్గంలో తెన్నేటి పార్కు, శివాజీపార్కు, ముడసర్లోవ పార్కు, సీతకొండ సీ వ్యూ పాయింట్ సందర్శన స్థలాలుగా పేరొందాయి. కైలాసగిరి కొండ దిగువన బీచ్‌ను ఆనుకొని తెన్నేటి పార్కు ఉంది. కైలాసగిరికి వెళ్లి వచ్చినవారు ఇక్కడ గంటల తరబడి సేదదీరుతారు. ఇది విశాలమైన పార్కు. ఈ పార్కులో కూర్చొని సముద్రం అలలను ఆస్వాదించవచ్చు. దీనికి సమీపంలో సీతకొండ సీ వ్యూ పాయింట్ సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివాజీపాలెం, ఎంవీపీ కాలనీ మధ్యలో శివాజీ పార్కు సందర్శకులకు ఆహ్లాదం పంచుతోంది. విశాలమైన బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని సింహాచలం కొండ, అటవీ శాఖకు చెందిన కంబాలకొండ మధ్యలో ముడసర్లోవ పార్కు ఉంది. ఇది ప్రశాంతతకు నిలయంగా మారింది. ఇక్కడ పిల్లల కోసం పలు రకాల ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి.

భక్తిశ్రద్ధలతో సువాసిని పూజ



ప్రత్యేక అలంకరణలో లలితాదేవి



సువాసిని పూజలో పాల్గొన్న భక్తులు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని లలితాపీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం సువాసినీ పూజ నిర్వహించారు. సుమారు 300 మంది మహిళలు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజ ఆచరించారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానందభారతీ మహాస్వామి సమక్షంలో పండితుల వేదమంత్రాల మధ్య ఈ పూజను శాస్త్రోక్తంగా చేశారు. పీఠం దర్బారు హాల్లో లలితాదేవిని పూలదండలతో అలంకరించారు. ముందుగా సామూహిక లలిత సహస్ర పారాయణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పీఠం మేనేజర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని పాల్గొని భక్తులను ఆశీర్వదించారు.

భక్తసత్కీర నాటక ప్రదర్శన నేడు

మీగడ రామలింగస్వామి బృందం సభ్యులతో బుధవారం సాయంత్రం 6 గంటలకు లలితా పీఠంలో 'భక్తసత్కీర' నాటకం ప్రదర్శన జరుగుతుందని పీఠం మేనేజర్ కృష్ణసేన్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు వెంపలి రాంబాబు, తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

సుందరంగా జోన్–3 కార్యాలయం

- రూ.50 లక్షలతో ఆధునికీకరణ
- కార్పొరేట్ స్థాయిలో ముస్తాబు



కార్యాలయంలో ఓ చాంబర్



కార్పొరేట్ స్థాయిలో జోనల్ కమిషనర్ రూం



లోపల కొత్త ఫ్లోరింగ్‌తో కారిడార్



ఆధునిక మరుగుదొడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ జోన్–3 కార్యాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. జీవీఎంసీ పరిధిలో ఒక్కో జోనల్ కార్యాలయం ఆధునికీకరణకు రూ.50 లక్షల చొప్పున వెచ్చించారు. ఇందులో భాగంగా ఆశీలమెట్ట అశోక్ నగర్‌లోని జోన్–3 కార్యాలయం ఆధునికీకరణ పనులు సార్వత్రిక ఎన్నికల సమయంలో చేపట్టారు. కొత్త ఫ్లోరింగ్, గోడలకు, బీరువాలకు రంగులు వేశారు. ఎలక్ట్రికల్ పనులు కూడా చేపట్టారు. కార్యాలయం ఇప్పుడు కొత్త శోభతో ఆకట్టుకుంటోంది. జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పర్యవేక్షణలో ఇంజినీర్లు ఈ పనులు చేపట్టారు. జోన్ పరిధిలో 14 నుంచి 27 వార్డులు ఉన్నాయి. ఈ వార్డులు తూర్పు, ఉత్తర నియోజకవర్గం పరిధిలో విస్తరించి ఉన్నాయి. ఆయా వార్డుల ప్రజలు నిత్యం పలు పనుల నిమిత్తం జోనల్ ఆఫీసుకి వస్తుంటారు. ఈ కార్యాలయంలో సౌకర్యం, రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, మలేరియా, యూసీడీ, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యశాఖ, తూర్పు నియోజకవర్గ ఓటర్ల నమోదు, తదితర విభాగాలు ఉన్నాయి. ఇక్కడ జీ+2 తరహాలో కార్యాలయం విస్తరించి ఉంది. మరమ్మతులు పూర్తి కావడంతో ఉద్యోగులు ఆహ్లాదకరమైన వాతావరణంలో విధులు నిర్వహిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో కార్యాలయాన్ని ఆధునికీకరించారని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేజీహెచ్‌లో చెట్టుకూ చికిత్స

పెద్ద ఆస్పత్రిలో అరుదైన ఘటన



చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంట్ చేస్తున్న నిపుణులు



జేసీబీ సహాయంతో చెట్టును యథాస్థానంలో నిలబెడుతున్న దృశ్యం



నాటిన తర్వాత ఠీవిగా నిల్చున్న బాదం చెట్టు

మహారాణిపేట: ఇటీవల కురిసిన వర్షాలకు కేజీహెచ్‌లో నేలకొరిగిన మహా వృక్షానికి మంగళవారం పునరుజ్జీవం కల్పించారు. ఆస్పత్రిలోని పార్కింగ్ ఆవరణలో గల 25 అడుగుల ఎత్తున్న బాదం చెట్టు వేళ్లతో సహా నేలకొరిగింది. అలా పడిన చెట్టును నరికేయకుండా తిరిగి యథాతథంగా నిలబెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. చెట్టులో కొన్ని కొమ్మలు తొలగించి, చెట్టు మానులో కూడా కొంత భాగాన్ని తొలగించి ఫంగల్ చికిత్స చేశారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన క్లైమేట్ ఫ్రంట్ అనే సంస్థ సహకారం తీసుకున్నారు. జేసీబీ సహాయంతో చెట్టు పడిన ప్రాంతానికి 50 మీటర్ల దూరంలోని వేరే స్థలంలో తిరిగి నాటారు. వర్షాలకు పడిపోయిన చెట్టుకు ఫంగల్ చికిత్స, న్యూట్రిషన్ ట్రీట్‌మెంటు చేయటం వల్ల చెట్టు చిగురించి బతుకుందని క్లైమేట్ ఫ్రంట్ ప్రతినిధి భట్టాచార్య తెలిపారు. గతంలో కాకినాడలో వైద్య కళాశాలలో కూడా పడిపోయిన చెట్టును తిరిగి పునర్జీవింపజేసినట్టు కేజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. కేజీహెచ్ ఏఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి జాతర

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురం పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 23న ప్రారంభమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా గ్రామస్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్పొరేటర్ కెల్ల సునీత, గ్రామ అధ్యక్షుడు వంకర బాబూరావు, పలువురు టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రామానికి సమీపంలో ఎస్ఏఎస్ఎన్ నగర్‌లో కూడా పైడిమాంబ అమ్మవారి పండగ జరిగింది. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలి



ప్రిన్సిపాల్‌ను అభినందిస్తున్న శ్యామ్‌ప్రసాద్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాలలో హ్యూమన్ రైట్స్ కోర్సులను పునరుద్ధరించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ కోరారు. మంగళవారం ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య కె.సీతామాణిక్యంను కార్యాలయంలో కలిసి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రెండు దశాబ్దాల క్రితం నుంచి ఏయూలో ఈ కోర్సుల నిర్వహణ జరుగుతోందని, వీటిని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. న్యాయ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయడానికి ఈ కోర్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా స్టేట్ చైర్మన్ సన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

- న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యంను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య రాజేంద్రప్రసాద్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్ నాశనం



పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న టీవీఏ ఇన్‌స్పెక్టర్ నాయుడు

సీతమ్మధార : మాదక ద్రవ్యాల వినియోగంతో బంగారు భవిష్యత్ నాశనం అవుతుందని స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో(సెబ్) స్టేషన్ ఇన్‌స్పెక్టర్ టీవీఏ నాయుడు హెచ్చరించారు. పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ పాఠశాలలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం(26న) పురస్కరించుకుని డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సరదాగా, ఫ్యాషన్‌గా మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే వ్యసనపరులుగా మారే అవకాశం ఉందని హెచ్చరించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్, వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్టు తెలిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఎవరైనా డ్రగ్స్ వైపు ప్రేరేపిస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో సెబ్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ముసలనాయుడు, హెడ్ కానిస్టేబుల్ సత్యం, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న చిత్రలేఖన, ఉపన్యాస పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐవైఎఫ్ఎస్ సభ్యులు

సీతంపేట : ఇండియా యూత్ ఫర్ సొసైటీ (ఐవైఎఫ్ఎస్), ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గాంధీ సెంటర్ సంయుక్తంగా ఈ నెల 30న ఉదయం 10 గంటలకు బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్టు పర్యావరణ ఇంజినీర్ పి.వి. ముకుందరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఇండియా యూత్ ఫర్ సొసైటీ బృందం మంగళవారం ఆవిష్కరించారు. 5 నుంచి 15 సంవత్సరాల వయసు కలిగిన విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని, 89780 19596కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. విజేతలకు అదే రోజు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పర్యావరణం, జంతు పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించడానికి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

కొమ్మాది : రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు

ఆరిలోవ: ఓ వ్యక్తిపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో బెదిరింపు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ పత్రిక విలేకరి పి.రామరాజు ఒక స్థలం విషయంలో ఇటీవల తన పత్రికలో వార్త రాశారు. ఆ వార్తలో తనకు సంబంధించిన ప్రస్తావన వచ్చిందంటూ కంచర్ల సందీప్ అనే వ్యక్తి రామరాజు ఇంటికి వెళ్లి బెదిరించాడు. ఇలాంటి వార్త ప్రచురితం చేస్తావా? నీ సంగతి చూస్తానని? అంటూ హెచ్చరించాడు. దీనిపై రామరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 23న కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

షిప్‌యార్డు విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నేడు

మురళీనగర్: హిందుస్థాన్ షిప్‌యార్డు రిటైర్డ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం మాధవధార మున్సిపల్ కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించనున్నట్టు ఆ సంఘం ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్ తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా 80 సంవత్సరాలు దాటిన 15 మంది సభ్యులను సూపర్ హీరోస్ టైటిల్‌తో సత్కరిస్తామని పేర్కొన్నారు.